క్లుప్తంగా

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత



యాత్ర నిర్వహిస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: భారత రాజ్యాంగ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ మారెల్లి రాజిరెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కాంగ్రెస్ చేపట్టిన జైభీమ్, జైబాపు, జైసంవిధాన్ అభియాన్ యాత్రలో భాగంగా రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ఆదేశాల మేరకు బుధవారం రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ 18వ డివిజన్ ఏరియాలో నిర్వహించిన భారత రాజ్యాంగ పరిరక్షణ యాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాలనీ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేశ్, మార్క రాజు, చక్రపాణి, కేశవులు, ఓదెలు, రాకేశ్, అజయ్, అఫ్సర్, కుమార్, దేవేందర్, రాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

జూలపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో అర్హులైన ఉపాధ్యాయులతో ప్రైవేటుకు దీటుగా నాణ్యమైన విద్య బోధిస్తున్నట్లు మండల విద్యాధికారి సరస్వతి అన్నారు. మండలంలోని కుమ్మరికుంట ప్రాథమిక పాఠశాలలో ముందస్తు బడిబాటకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం గడ్డం అనంతరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ



పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమం

గోదావరిఖనిటౌన్: అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక గణేశ్‌నగర్‌లోని అంగన్వాడీ కేంద్రంలో సీమంతం, అన్నప్రాసన కార్యక్రమాలు చేపట్టారు. రామగుండం ప్రాజెక్టు జనగామ సెక్టార్ సూపర్‌వైజర్ సరస్వతి గర్భిణులకు పోషకాహారం, జాగ్రత్తల గురించి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే ప్రోగ్రాం నిర్వహించారు. అంగన్వాడీ టీచర్లు ఎ.రమాదేవి, శశిరేఖ, షబానా, రజిత, కౌసల్య, ఆయాలు సరిత, మంగ పాల్గొన్నారు.

మంత్రిపై అసత్య ఆరోపణలు



మాట్లాడుతున్న తోట్ల తిరుపతియాదవ్

రామగిరి: మంథనిలో మంత్రి శ్రీధర్‌బాబు చేస్తున్న అభివృద్ధిని చూసి బీఆర్ఎస్ కార్యకర్తలు చేజారకుండా మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు మంత్రిపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతియాదవ్ అన్నారు. మండలంలోని సెంటినరికాలనీ శ్రీపాదభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో మంత్రి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక పుట్ట మధు అసత్య ఆరోపణలతో కాలం వెళ్లదీస్తున్నాడని ఎద్దేవా చేశారు. మండల అధ్యక్షుడు రోడ్డ బాపన్న, నాయకులు వనం రాంచందర్‌రావు, గంట వెంకటరమణారెడ్డి, కాటం సత్యం, చిందం మహేశ్, కొప్పుల గణపతి, ముస్త్యాల శ్రీనివాస్, కండె పోచం, బర్ల శ్రీనివాస్, అవినాష్, బంక్ మల్లేశ్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

పెద్దపల్లిరూరల్: కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని తెనుగువాడలో ముదిరాజ్ కులస్తులకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని కౌన్సిలర్ భూతగడ్డ సంపత్ ప్రారంభించారు. డాక్టర్ దీక్షిత్ 120 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి షుగర్, బీపీ, 2డి ఎకో పరీక్షలు చేశారు. మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, బొంగోని హరీశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రామగుండం తహసీల్దార్ బదిలీ

రామగుండం: రామగుండం తహసీల్దార్ గెరివేణ కుమారస్వామి బుధవారం మంథని తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు. ఇప్పటివరకు ఆయన స్థానంలో మరో అధికారిని నియమించలేదు. సత్వరమే తహసీల్దార్‌ను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

పండుటాకులకు తోడూ నీడ

- ప్రారంభానికి సిద్ధమైన సుల్తానాబాద్ ప్రభుత్వ వృద్ధాశ్రమం



సుల్తానాబాద్‌లో ప్రారంభానికి సిద్ధమైన వృద్ధాశ్రమం

సుల్తానాబాద్: ఇప్పటిదాకా వృత్తి, ఉద్యోగం, కుటుంబ బాధ్యతలతో క్షణం తీరిక లేకుండా కుటుంబ బాధ్యతలు మోసిన వారంతా ఇప్పుడు వయోవృద్ధులు. చిన్ననాటి సంగతులు తమ జీవన గమనంలో ఎదుర్కొన్న ఒడిదొడుకులు, అనుభవాలు పంచుకోవడానికి ఒక వేదిక అవసరమని ప్రభుత్వం భావించింది. వయోవృద్ధుల ఆశ్రమం నిర్మించింది. నాలుగేళ్ల క్రితం ప్రభుత్వ స్థలం కావాలని డీడబ్ల్యూవో అధికారులు కలెక్టర్‌కు లేఖ పంపారు. కాగా జిల్లాలో ఖాళీ స్థలాలు ఎక్కడ ఉన్నాయో గుర్తించాలని లేఖ రాయడంతో సుల్తానాబాద్‌లో గుర్తించి కేటాయించి నిర్మించారు. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం 2023 జనవరి 24న వృద్ధాశ్రమం మంజూరు చేసింది. రూ.70 లక్షల వ్యయంతో నిర్మాణం ప్రారంభించారు. నిర్మాణం పూర్తి కావడంతో ప్రారంభానికి సిద్ధమైంది.

సుల్తానాబాద్‌లో వృద్ధాశ్రమం..

సుల్తానాబాద్ మార్కండేయ కాలనీలో వృద్ధాశ్రమం నిర్మించారు. వృద్ధాశ్రమం నిర్వహణ కోసం 50 పడకలు నిర్మించారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏకైక వృద్ధాశ్రమం కావడంతో ప్రభుత్వ నిబంధనలకు లోబడి పనిచేసే ఎన్జీవోకు అప్పగించనున్నారు.

సిబ్బందికి ఇంటర్వ్యూ పూర్తి

వృద్ధాశ్రమం నిర్వహణ కోసం 70శాతం ఖర్చు ప్రభుత్వం భరిస్తుండగా 30శాతం నిర్వహణ ఎన్జీవో భరించాల్సి ఉంటుంది. వృద్ధాశ్రమం నిర్వహణకు 10మంది సిబ్బంది అవసరం. డాక్టర్, నర్సు, కుక్, వాచ్‌మెన్, ఆయాతో పాటు పలు రకాల సిబ్బందికి ఇంటర్వ్యూ పూర్తి చేశారు.

ఎన్జీవోల ఇంటర్వ్యూ పూర్తి

ప్రభుత్వ వృద్ధాశ్రమానికి నాలుగు ఎన్జీవోల దరఖాస్తులు రావడంతో ఇంటర్వ్యూ పూర్తి చేశాం. త్వరలో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశానుసారం నియమ నిబంధనలకు లోబడి అర్హులను గుర్తించి వారికి కేటాయిస్తాం. వృద్ధాశ్రమం ముందు భాగం గార్డెన్ పెట్టాల్సి ఉన్నందున ఈ నెల చివరిలో ప్రారంభిస్తాం.

– వేణుగోపాలరావు, డీడబ్ల్యూవో

బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న కోరుకంటి చందర్

జ్యోతినగర్: బీఆర్ఎస్ శ్రేణులు రజతోత్సవ సభ విజయవంతానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ పిలుపునిచ్చారు. బుధవారం ఎన్టీపీసీ రామగుండం పట్టణ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ చెప్పిన అబద్ధాలు నమ్మి ప్రజలు అధికారం ఇచ్చారని, వచ్చిన అవకాశాన్ని ఆ పార్టీ నాయకులు సద్వినియోగం చేసుకోక ఆగమాగం చేస్తున్నారన్నారు. మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ ఒక్కటే ఈ రాష్ట్ర ప్రజలకు రక్షణగా ఉంటుందన్నారు. వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరగనున్న రజతోత్సవ వేడుకల్లో భాగంగా భారీ బహిరంగ సభకు రామగుండం నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు వేలాదిగా తరలిరావాలని కోరారు. బీఆర్ఎస్ ఎన్టీపీసీ పట్టణ కమిటీ అధ్యక్షుడు బుర్ర శంకర్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కౌశిక హరి, మాజీ కార్పొరేటర్లు కృష్ణవేణి, శ్రీనివాస్, రమణారెడ్డి పాల్గొన్నారు.

ఉచిత ఆర్మీ శిక్షణను వినియోగించుకోవాలి



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఏసీపీ రమేశ్, సీఐ ఇంద్రసేనారెడ్డి

గోదావరిఖని: ఉచిత ఆర్మీ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని గోదావరిఖని ఏసీపీ మడత రమేశ్ కోరారు. స్థానిక సీఈఆర్ క్లబ్‌లో బుధవారం అగ్నివీర్ ఆర్మీరిక్రూట్‌మెంట్ పరీక్షలకు హాజరైె అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, ఇన్‌చార్జి మహిపాల్‌రెడ్డి, టీచింగ్ ఫ్యాకల్టీ పాల్గొన్నారు.

ఘనంగా రంగనాయకస్వామి తెప్పోత్సవం



స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం నీరుకుల్లలోని రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రంగనాయకస్వామి తెప్పోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో శంకరయ్య, పురోహితులు గోవర్ధనగిరి మనోహరాచార్యులు, గోవర్ధనగిరి రాజ్‌కుమార్, క్లర్క్ ప్రవీణ్, భక్తులు పాల్గొన్నారు.

ప్రజలపై ఎల్లమ్మతల్లి ఆశీస్సులు ఉండాలి



మొక్కులు చెల్లిస్తున్న శ్రీనుబాబు

రామగిరి: రేణుకా ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని శ్రీపాద ట్రస్ట్ చైర్మన్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు దుద్దిళ్ల శ్రీనుబాబు ఆకాంక్షించారు. మండలంలోని ఆదివారంపేటలోని ఎల్లమ్మతల్లి ఆలయాన్ని బుధవారం ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వివిధ గ్రామాలకు చెందిన బాధిత కుటుంబాలను పరామర్శించారు. మండల అధ్యక్షుడు రోడ్డ బాపన్న, జిల్లా ఉపాధ్యక్షుడు తోట చంద్రయ్య, నాయకులు బర్ల శ్రీనివాస్, ఆరెల్లి కొముురయ్య, అవినాష్, బంక్ మల్లేశ్ ఉన్నారు.

భూభారతిపై అవగాహన కలిగి ఉండాలి

రామగుండం: రాష్ట్ర ప్రభుత్వం ధరణి స్థానంలో నూతనంగా భూభారతి పేరుతో ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ముందుస్తుగా రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు సదరు భూభారతిలో పొందుపరిచిన అంశాలపై అవగాహన కలిగి ఉండాలి. బుధవారం అంతర్గాం మండల పరిషత్ కార్యాలయంలో భూ భారతిలో పొందుపరిచిన నూతన ఆర్‌వోఆర్ చట్టం విధి విధానాలు, చట్టం ప్రాముఖ్యత, భూమి హక్కుల భద్రత, భూ సమస్యల సత్వర పరిష్కారం అంశాలపై అంతర్గాం తహసీల్దార్ తూమ్ రవీందర్ పటేల్ క్షేత్రస్థాయి అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. గురువారం బ్రాహ్మణపల్లి రైతువేదికలో ఏర్పాటు చేసే భూభారతి అవగాహన సదస్సులో రైతులు అడిగే ప్రశ్నలకు వారికి సులభంగా అర్థమయ్యేలా సమాధానం చెప్పాలని సూచించారు. ఎంపీడీవో బైరి వేణుమాధవ్, సూపరింటెండెంట్ కరుణాకర్, కమల, రమేశ్, ఆర్ఐలు శ్రీమాన్, రమేశ్ ఉన్నారు.

లక్ష్మీనర్సింహస్వామి ఆలయ హుండీ లెక్కింపు

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్ శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భక్తులు సమర్పించిన కానుకల హుండీలను ఆలయ ఈవో సదయ్య సమక్షంలో బుధవారం లెక్కించారు. హుండీలలో వేసిన ఆదాయం రూ.6,36,335 రాగా, దుకాణాల వేలంలో రూ.3,01,500 వచ్చాయి. మొత్తం రూ.9,37,835 ఆదాయం సమకూరినట్లు ఈవో వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, ఎండోమెంట్ అధికారులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇబ్బందులకు గురిచేస్తున్న అధికారిపై చర్య తీసుకోవాలి

రామగిరి: ఆర్అండ్ఆర్ పరిహారం ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న ఫైనాన్స్ ఏజీఎంపై చర్యలు తీసుకోవాలని బుధవారం ఆర్జీ–3 జీఎం నరేంద్రసుధాకర్‌రావుకు లద్నాపూర్ భూనిర్వాసితులు దుబాసి రంగయ్య, వేల్పుల రమేశ్ ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఆర్జీ–3 జీఎం నరేంద్ర సుధాకర్‌రావును వివరణ కోరగా భూనిర్వాసితుల ఫిర్యాదుపై విచారణ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆర్అండ్ఆర్ పరిహారం విషయంలో జరిగిన జాప్యాన్ని గుర్తించి డాక్యుమెంట్లు పరిశీలించి త్వరలోనే వారికి పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రభుత్వ పాఠశాలల సౌకర్యాలపై పరిశీలన

ఎలిగేడు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్, మౌలిక సౌకర్యాలు, తదితర వివరాలను యూ డైస్ కార్యక్రమంలో భాగంగా డైట్ కరీంనగర్ విద్యార్థులు పరిశీలన కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా మండలంలోని సుల్తాన్‌పూర్ ప్రాథమిక, ఎస్సీకాలనీలోని ప్రాథమిక పాఠశాలలను బుధవారం సందర్శించారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల సంఖ్య, మౌలిక వసతులు, తరగతి గదుల సంఖ్య, మూత్రశాలలను పరిశీలించారు. ఎంఈవో నరేంద్రచారి, హెచ్ఎం అప్పిడి సంతోష్‌రెడ్డి, సీఆర్పీ లక్ష్మీనారాయణ, డైట్ విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• నేత్రదానంతో ఇద్దరికి చూపు

కోల్‌సిటీ: గోదావరిఖనిలో కూతురు మరణించిన పుట్టెడు దుఃఖంలోనూ తల్లిదండ్రులు ఇద్దరు అంధులకు కంటి చూపును ప్రసాదించడానికి ఆమె నేత్రాలను దానం చేశారు. గోదావరిఖని పవర్‌హౌస్ కాలనీకి చెందిన చుంచు ప్రత్యూష(26) అనే యువతి మంగళవారం ఇంట్లో ఆత్మహత్య చేసుకుంది. నేత్రదానంపై సదాశయ ఫౌండేషన్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి కే.ఎస్.వాసు కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. దీంతో ఆమె నేత్రాలను దానం చేయడానికి తల్లిదండ్రులు విఠల్, నిర్మల, ఇద్దరు అక్కలు ముందుకు వచ్చారు. బుధవారం ఎల్వీప్రసాద్ ఐబ్యాంక్ సీనియర్ టెక్నీషియన్ ప్రదీప్ నాయక్ సహకారంతో ప్రత్యూష నేత్రాలను సేకరించి, హైదరాబాద్‌కు తరలించారు. వన్‌టౌన్ ఎస్సై భీమేష్ చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు అభినందన పత్రం అందజేశారు. కుటుంబ సభ్యులను సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు టి.శ్రవణ్ కుమార్, లింగమూర్తి, మెరుగు భీష్మాచారి, గౌరవ అధ్యక్షుడు సానా రామకృష్ణారెడ్డి, సలహాదారులు నూక రమేశ్, ప్రచార కార్యదర్శి కే.ఎస్.వాసు, జిల్లా మహిళా అధ్యక్షురాలు వెల్దికవిత అనంతరాములు, పట్టణ కార్యదర్శి బోల్ల చంద్రశేఖర్, రామగుండం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పి.మల్లికార్జున్ అభినందించారు.

• అనారోగ్యంతో మాజీ సర్పంచు మృతి

ఓదెల: మండలంలోని పొత్కపల్లి మాజీ సర్పంచు సర్వ పుల్లమ్మ(95) అనారోగ్యంతో మంగళవారం తెల్లవారుజామున మృతిచెందారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, కుమార్తెలు ఉన్నారు. అంత్యక్రియలు బుధవారం హన్మకొండలో జరుగుతాయని మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపారు.

• ప్రజలు జాగ్రత్తలు పాటించాలి

ఎలిగేడు: దంచికొడతున్న ఎండల తీవ్రతతో మండల ప్రజలు వడ దెబ్బబారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మెడికల్ ఆఫీసర్ నిస్సీక్రిస్టీనా బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. ఎండాకాలంలో ఎక్కువ మోతాదులో నీళ్లు తాగాలని, వీలైనంత సమయం చల్లని ప్రదేశాల్లో ఉండేలా చూసుకోవాలన్నారు. తలనొప్పి, వాంతులు, విరేచనాలు, జ్వరం, నీరసం, చెమటలు పట్టడం వంటి లక్షణాలు గమనిస్తే వెంటనే దగ్గరలోని ఆరోగ్య కేంద్రంలో డాక్టర్లను సంప్రదించి చికిత్స పొందాలని ఆమె పేర్కొన్నారు.

• పంచాయతీ కార్మికుల సమ్మె నోటీసు

జూలపల్లి: పంచాయతీ కార్మికులకు రావాల్సిన ఆరునెలల పెండింగ్ జీతాలు చెల్లించాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని కాచాపూర్‌లో పంచాయతీ కార్మికులు కార్యదర్శి కొర్రె రేవతికి బుధవారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ 19లోపు సమస్యలపై స్పందించకుంటే సమ్మె చేస్తామని తెలిపారు. కార్మికులు భాస్కర్, సూర్యనందం, అంజయ్య, కొండయ్య, రాజయ్య, దామోదర్ ఉన్నారు.

• బీఆర్ఎస్ రజతోత్సవాలను విజయవంతం చేయండి

గోదావరిఖని: బీఆర్ఎస్ రజతోత్సవాలను విజయవంతం చేయాలని పోలీస్ హౌసింగ్ బోర్డు మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ బుధవారం ఒక ప్రకటనలో పార్టీ శ్రేణులను కోరారు. రాష్ట్ర ప్రజల ఆశయాలను నెరవేర్చిన ఏకైక నాయకుడు మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. అబద్ధాలు, అమలు చేయని వాగ్దానాలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చేందుకు వరంగల్‌లో పార్టీ రజతోత్సవ మహాసభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

• యువసేన ఆధ్వర్యంలో చలివేంద్రం, అంబలి కేంద్రం ప్రారంభం

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకు వద్ద ఛత్రపతి యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం, అంబలి కేంద్రాన్ని బుధవారం ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఏటా ఛత్రపతి శివాజీ యువసేన ఆధ్వర్యంలో చలివేంద్రం, అంబలి కేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని మేనేజర్ కొనియాడారు. కార్యక్రమంలో జంగపెల్లి శ్రీనివాస్, సతీశ్, అజయ్, మచ్చగిరి రాము, రంగు సత్యనారాయణ, అనవేన లక్ష్మీరాజం, మల్యాల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నియంత్రణకు ట్రాఫిక్ కోన్స్ ఏర్పాటు



ట్రాఫిక్ కోన్స్ ఏర్పాటు చేస్తున్న ట్రాఫిక్ సీఐ రాజేశ్వరరావు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ లూర్దునగర్‌లో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో డైవర్షన్ లేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు బుధవారం రామగుండం ట్రాఫిక్ సీఐ బి.రాజేశ్వరరావు, ఎస్సై జి.హరిశేఖర్ ఆధ్వర్యంలో రోడ్డు డైవర్షన్ చేసేందుకు ట్రాఫిక్ కోన్స్ ఏర్పాటు చేశారు. హ్యాండ్స్ టూ సేవ్ ఫౌండేషన్ నిర్వాహకుడు అరవింద, స్థానిక యువకులు పాల్గొన్నారు.

గ్రామగ్రామాన గులాబీ జెండా ఎగరాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పుట్ట మధు

మంథని: గులాబీ పార్టీ పండుగ రోజు ఈ నెల 27న గ్రామగ్రామాన గులాబీ జెండా ఎగరాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు అన్నారు. మంథని రాజగృహలో రామగిరి, కమాన్‌పూర్, ముత్తారం, మంథని మండలాల ముఖ్య నాయకులతో బుధవారం ఆయన సన్నాహక సమావేశం నిర్వహించారు. రజతోత్సవ బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని అంశాల్లో విఫలమైందని ఆరోపించారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమంగా కేసులు పెడితే సహించేది లేదని, కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. కేసీఆర్ నాయకత్వమే రాష్ట్రానికి శ్రీరామరక్ష అని అన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు



రామగిరి: కల్వచర్లలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీపీఎం నాగేశ్వరరావు

రామగిరి: ఆరుగాలం కష్టపడి పండించిన పంటను రైతులు దళారులకు అమ్మి మోసపోవద్దని డీపీఎం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని కల్వచర్ల, లొంకకేసారం, బేగంపేట, నవాబ్‌పేట, లద్నాపూర్, రాజాపూర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యం అమ్ముకోవాలని రైతులకు సూచించారు. వేసవి దృష్ట్యా కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఓఆర్ఎస్, తాగునీరు, నీడ, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఏపీఎం స్వరూపరాణి, పీఏసీఎస్ డైరెక్టర్ సైండ్ల సత్యనారాయణ, మాజీ ప్రజాప్రతినిధులు గంట పద్మ, కొట్టె సందీప్, స్థల దాత రేండ్ల శారద, సీసీలు శంకర్, రమేశ్, శోభారాణి పాల్గొన్నారు.

పీఏసీఎస్ ఆధ్వర్యంలో..

మండలంలోని కల్వచర్ల, పన్నూర్, నాగేపల్లి గ్రామాల్లో బుధవారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ చైర్మన్ ఇనగంటి భాస్కర్‌రావు ప్రారంభించారు. కనీస మద్దతు ధర క్వింటాల్ గ్రేడ్ ఏ రకానికి రూ.2320, సాధారణ రకానికి రూ.2300 ధర నిర్ణయించినట్లు తెలిపారు. ఏవో శ్రీకాంత్, సింగిల్‌విండో డైరెక్టర్ సైండ్ల సత్యనారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రోడ్డ బాపన్న, మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి, ఆరెల్లి కొముురయ్య, ముస్త్యాల శ్రీనివాస్, బంక్ మల్లేశ్ పాల్గొన్నారు.

కమాన్‌పూర్ మండలంలో..

కమాన్‌పూర్: మండలంలోని కమాన్‌పూర్, గుండారం, రాజాపూర్, పేరపల్లి, సిద్దిపల్లె, ముల్కలపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఎంపీడీవో లలిత ప్రారంభించారు. రైతులు ధాన్యాన్ని నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వం చెల్లించే మద్దతు ధర పొందాలని సూచించారు. ఏపీఎం శైలజకాంతి, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, నిర్వాహకులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు చట్టబద్ధ హక్కులు కల్పించాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాంతంలోని తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టులో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులకు చట్టబద్ధమైన హక్కులు కల్పించాలని సీఐటీయూ అనుబంధ రామగుండం ఇండస్ట్రియల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు గీట్ల లక్ష్మారెడ్డి, నాంసాని శంకర్ డిమాండ్ చేశారు. ప్రాజెక్టు మెయిన్ గేట్ వద్ద కార్మికులకు హక్కులు కల్పించడంతో పాటు సమస్యలు పరిష్కరించాలని బుధవారం కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పని ప్రదేశాల్లో కనీస వసతులు కరువయ్యాయని ఆరోపించారు. కాంట్రాక్టు కార్మికులకు విశ్రాంతి గదులు, టాయ్‌లెట్స్, ఐసీహెచ్ క్యాంటీన్, తాగునీరు, వెహికిల్ షెడ్లు, రోడ్లు లాంటి కనీస సౌకర్యాలు లేవని వాపోయారు. కాంట్రాక్టు కార్మికులందరికీ చట్టబద్ధమైన హక్కులు, సౌకర్యాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికవర్గ చైతన్యంతోనే సంఘటితమై పోరాటాలకు సన్నద్ధం కావాలని కోరారు. కార్మికులకు సీఐటీయూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్, దండ రాఘవరెడ్డి, యాకూబ్, రవి పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల డిమాండ్లు పరిష్కరించాలి



కాల్వశ్రీరాంపూర్: వినతిపత్రం ఇస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

కాల్వశ్రీరాంపూర్: ఫీల్డ్ అసిస్టెంట్ల డిమాండ్లు పరిష్కరించాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లు బుధవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పూర్ణచందర్‌రావు, తహసీల్దార్ కార్యాలయంలో డీటీ శంకర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించక పోతే దశల వారీగా నిరసన ప్రదర్శనలు, ధర్నాలు చేస్తామని పేర్కొన్నారు. యూనియన్ అధ్యక్షుడు ఆసంపల్లి శ్రీనివాస్, నాయకులు రాజిరెడ్డి, బండారి శంకర్, సంపత్, సమ్మయ్య, కుమార్, వివిధ గ్రామాల ఫీల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రామగిరి: ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలని బుధవారం మండల ఫీల్డ్ అసిస్టెంట్లు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శైలజారాణికి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ఐఎన్‌టీయూసీ ఫీల్డ్ అసిస్టెంట్ల పిలుపు మేరకు నిరసన కార్యక్రమంలో భాగంగా వినతిపత్రం అందజేశారు. మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని, మేనిఫెస్టోలో తెలిపిన విధంగా పేస్కేల్, ఉద్యోగ భద్రత, హెల్త్‌కార్డులు అందించాలన్నారు. మండల ఫీల్డ్ అసిస్టెంట్లు పేరవేన కొమురయ్య, ముప్పిడి నాగేశ్, ఎంజాల సతీశ్, కన్నూరి రాజయ్య, సంపత్, జ్యోతి పాల్గొన్నారు.

ఏడాదిన్నర కాలంగా పెండింగ్‌లో బిల్లులు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులు చేపట్టిన పలువురు కాంట్రాక్టర్లకు ఏడాదిన్నర కాలంగా బిల్లులు రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. గత ఏప్రిల్ 2024 నుంచి మార్చి 2025 మధ్యకాలంలో 34 చెక్కులు వాటి విలువ రూ.50.19 లక్షలు కాగా, స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ విభాగానికి చెందిన చెక్కులు 23, వాటి విలువ రూ.29.93 లక్షలుగా ఉంది. మొత్తంగా గతేడాది ఆర్థిక సంవత్సరం నుంచి ఇప్పటివరకు సుమారు పది మంది కాంట్రాక్టర్లకు చెందిన రూ.80.12 లక్షల విలువ చేసే చెక్కులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వం తక్షణమే స్పందించి చెక్కులను క్లియరెన్స్ చేయాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు.

ఏడాదైనా అందని ఎంపీ ఎన్నికల రెమ్యునరేషన్ బిల్లులు..

గతేడాది జరిగిన పార్లమెంట్ ఎన్నికల విధుల్లో పాల్గొన్న సిబ్బందికి రెమ్యునరేషన్ చెల్లించకపోవడంపై ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. గతేడాది మార్చి 23 నుంచి ఏప్రిల్ 2 వరకు, ఏప్రిల్ 18 నుంచి మే 12వ తేదీ వరకు మొత్తంగా 36 రోజులకు సంబంధించి రెమ్యునరేషన్ రావాల్సి ఉందని వారు పేర్కొన్నారు. గత ఫిబ్రవరి 28న జిల్లా ఎన్నికల అధికారి (కలెక్టర్)కి సదరు బాధిత ఉద్యోగులు తమకు రావాల్సిన రెమ్యునరేషన్ చెల్లించాలని విన్నవించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలపై సర్వే

కాల్వశ్రీరాంపూర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాల సంఖ్య తగ్గడానికి గల కారణాలపై సర్వే చేస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం స్థానికంగా ఉన్న కేజీబీవీ పాఠశాలలో ప్రత్యేక సర్వే బృందం వివరాలు సేకరించింది. పాఠశాలలో కనీస మౌలిక వసతులు, విద్యార్థుల హాజరు, గత విద్యా సంవత్సరాల్లో విద్యార్థుల నమోదుపై సమగ్ర వివరాలు సేకరించారు. కార్యక్రమంలో ఎంఈవో మహేశ్‌కుమార్, డైట్ కాలేజీకి చెందిన ఛాత్రోపాధ్యాయులు అలేఖ్య, ప్రత్యూష, రమ్య, సీఆర్పీలు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.